# ప్రణయజీవులు



## రచన : సులోచన

సిటీ బస్సు రోజూ సాయంత్రం ఆ మార్కెట్టుకు ఎదురుగ్గా అయిదున్నర గంటలకు ఆగుతుంది.

అదే బస్సు అదే సమయంలో ఎక్కటానికి పద్ధెనిమిదేళ్ళ యువతి గరల్సు హైస్కూలు నుంచి వొస్తుంది.

అదే బస్సు అదే సమయంలో ఎక్కటానికి ఇరవైయేళ్ళ యువకుడు తాలూకా ఆఫీసు నుంచి వొస్తాడు.

ఇద్దరూ ఒకేచోట దిగుతారు.

కాని ఒకే వీధికేసి వెళ్ళరు.

సిటీ బస్సులో ఆ యువకుని ఎదురుగ్గా ఆ యువతిగానీ, ఆ యువతి ఎదురుగ్గా ఆ యువకుడుగానీ కూర్చుంటారుగానీ, ఒకరి ప్రక్కన ఒకరు కూర్చోవడం ఎన్నడూ జరిగి వుండలేదు.

చేతిలోని పుస్తకాల వంక చూస్తోన్నట్టు చూస్తూ అప్పుడప్పుడు ఓరగా, సిగ్గుగా నేరం చేస్తూన్నట్టు, తప్పు అయినట్టూ— అతనివంక చూడడం నేర్చుకుందామె.

ఆ అబ్బాయి కూడా చేతిలో ఉన్న ఫైల్సు వంక చూస్తోన్నట్టు చూస్తూ అప్పుడప్పుడూ ఓరగా, సిగ్గుగా, నేరంచేస్తూన్నట్టు, ఎన్నడూ అమ్మాయిల వంక చూడనట్టు—ఆమె వంక చూడటం నేర్చుకున్నాడు.

ఆమె ఎవరో నిజంగా అతనికి తెలీదు.

అతనెవరో నిజంగా ఆమెకు తెలీదు.

ఆమె ఎక్కడ పనిచేస్తూన్నదో అతను గ్రహించాడు.

అట్లాగే అతను ఎక్కడ పనిచేస్తున్నాడో ఆమె గ్రహించింది.

ఆ అబ్బాయి ఎప్పుడూ నల్ల కళ్ళజోడు పెడతాడు. ఆ ముఖానికీ, వొంకుల వొంకుల నల్లని అందమైన జుత్తుకీ—ఆ కళ్ళజోడు ఎంతో అందాన్ని ఇచ్చింది. అట్లా వుంటేనే ఆ అబ్బాయి ఎంతో బావుంటాడు—అనుకుంది ఆమె.

ఆ అమ్మాయి ఎప్పుడూ మల్లెపువ్వు లాంటి చీరలు కడుతుంది. ఆమెకు మల్లె పువ్వులూ, నందివర్ధనం పువ్వులూ అంటే అమితమైన ఇష్టమేమో! ఆ చీరలు కట్టుకుంటేనే ఆమె ఎంతో అందంగా వుంటుంది—అనుకుంటాడు అతను.

ఒక రోజు అతను, ఆమె పుస్తకం మీద ఆమె పేరు చూశాడు—ఆమె పేరు: ప్రభావతి.

ఒక రోజు ఆమె అతని ఫైలుమీద అతని పేరు చూసింది—అతని పేరు: కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి ఆమెను మనసారా ప్రేమించాడనీ, ప్రభావతి అతనిని మనసారా ప్రేమించిందనీ నిక్కచ్చిగా చెప్ప

వొచ్చుగానీ — ఎవరు ఎవర్ని ముందుగా ప్రేమించారో చెప్పలేం.

కాని ఆ అబ్బాయికి పెళ్లి అయిం దేమో! సందేహంతో బాధ పడింది ఆమె. మరి ఆ అమ్మాయి సంగతో — మెడలో తాళి బొట్టు తాలూకు చిహ్నాలు ఏమీ లేవు! పెళ్ళి అయివుండ దనుకున్నాడు కృష్ణమూర్తి.

ఇద్దరి చూపులు కలిశాయి, మనసులు కలిశాయి, చిరునవ్వులుకూడా జరిగాయి— మాటలే ఇంకా దొర్లలేదు.

ఒక రోజు ఆమె అదే టైముకు రాక పోతే వొచ్చేవరకూ బస్సు స్టాపు దగ్గర అతను వేచివుంటాడు. ఆమెకూడా అంతే!

ఆమెను పలుక రించాలనే అభిలాష అతనికి బాగా ఉంది. ఆమెకూ అంతే! కాని ఎవరు ముందు పలుకరిస్తారు!

ఒకరోజు సాయంత్రం ఆమె పుస్తకం లోంచి ఒక కవరు జారి ఎదురుగ్గా కూ ర్చున్న కృష్ణమూర్తి పాదాల మీద పడింది. కృష్ణమూర్తి ఆ కవరు ఆమెకు అందించాలనే ఉద్దేశ్యంతో వంగి కవరు తీశాడు: పైన 'కృష్ణమూర్తిగారికి' అని ఉంది. కృష్ణమూర్తి పొంగి పోయాడు. వొళ్లంతా ఒక్కసారి గగుర్పొడిచింది. ఆమె వంక చూశాడు విజయగర్వంతో.

ఆమె సిగ్గు పడ్తుంది. తల ప్రక్కకు తిప్పుకుంది. ఆమె చెక్కిళ్ళు కించిత్తుగా అదరటం గమనించాడు కృష్ణమూర్తి.

బస్సు దిగగానే పలుకరించాలని చూ శాడు. అతని వాలకాన్ని చూసి ప్రభా వతి గబగబా నడిచి వెళ్ళింది. ఆమె వెంట బడటం మర్యాదగా ఉండదని అతను భావించాడు.

గదికి వెళ్లగానే ఆదుర్దా కొద్దీ కవరు విప్పి చూసుకున్నాడు.

—ప్రియమైన,

నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిం చాను. నేను టీచరుగా పనిచేస్తున్నాను. నాకు తల్లి తప్ప ప్రపంచంలో ఎవ్వరూ లేరు. మీకు ఇష్టమైతే ఇద్దరమూ వివాహ మాడదాం. జవాబు వ్రాయవలసింది—

ప్రభ.

అంతే ఆ లేఖలో ఉంది! ఇంకేం కావాలి?

మరునాడు కృష్ణమూర్తి ఇట్లా లేఖ వ్రాసి కవర్లో పెట్టాడు:

—ప్రియమైన,

నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిం చాను. నేను తాలూకా ఆఫీసులో గుమా స్తాగా పనిచేస్తున్నాను. నాకు తల్లికూడా లేదు. నాకు నేనే! మన ఇద్దరమూ వివా హం చేసుకుందాం. ఎప్పుడు?

—కృష్ణమూర్తి.

ఆ కవరు ఆమె తనకెట్లా చేర్చిందో అట్లానే ఆమె పాదాల మీద పడవేశాడు 'ప్రభావతికి' అని రాసి.

ప్రభావతి సంతోషంతో ఆ కవరు అందుకుంది.

ఒక శుభ ముహూర్తాన వాళ్లిద్దరికీ వివాహం జరిగింది.

ఆ రాత్రే శోభనం!

శోభనపు గది ఉన్నంతలో బాగానే అలంకరించ బడింది. ఆ రాత్రి ప్రభావతి గులాబి రంగు మైసూరు సిల్కుచీర ధరించింది.

'మల్లె పువ్వురంగు చీరలకంటే ఈ రంగు చీరలే నీకు బావుంటాయి' అన్నాడు కృష్ణమూర్తి.

'మల్లె పువ్వురంగు చీరల్ని ధరించాల్సిన అవసరం ఇక లేదుగా' అన్నదామె.

ఆ వాక్యంలోని గూఢార్థం త్వరగా అంతుపట్టలేదు ఆ పెళ్లి కొడుక్కి.

'అంటే—'

అంతలోనే కన్నీటి ముద్ద అయింది ప్రభావతి.

'క్షమించండి! ఇన్నాళ్ళుగా నేను విధవను......మీరు పునిస్త్రీగా నన్ను మార్చి...'

కృష్ణమూర్తి ముఖం కాంతి హీనమైంది. హతాశుడైనాడు. ఆమె తెల్ల చీరలు ధరించటానికి ఇదా కారణం!

అయితే యేం, ఆమె తప్పును సులభంగానే క్షమించగల్గాడు కృష్ణమూర్తి. వారిది ఆదర్శ హృదయం అనుకుంది—ప్రభావతి.

ప్రభావతిని దగ్గరకు తీసుకున్నాడు కృష్ణమూర్తి. ముద్దు పెట్టుకో బోయాడు హృదయావేశంతో. కాని అలాంటప్పుడు కూడా భర్త నల్ల కళ్ళ జోడు పెట్టుకొని వుండడం ఆమెకు భావ్యంగా తోచలేదు.

'ఇంకా యీ రాత్రి కూడా యీ నల్ల కళ్ళ జోడు దేనికండీ—' అంటూ భర్త కళ్ళజోడు తీసి వేసింది.

కృష్ణమూర్తి బిగ్గరగా నవ్వాడు.

కెవ్వున కేక వేసింది ప్రభావతి.

కృష్ణమూర్తికి ఒక కన్ను గుడ్డిది.

★


నేడే చదవండి!

## దాసుగారి డిటెక్టివ్ నవలలు

| | | | |
|---|---|---|---|
| 1. | కాంతం—కనకం | 2. | దెయ్యాల దిబ్బ |
| 3. | నడిచిపోయిన శవం | 4. | మరుపురాని మగువ |
| 5. | మాయమైన మనిషి | 6. | సాలెగూడు |
| 7. | పులిగోరు | 8 | సుడిగుండం |
| 9. | కాళరాత్రి | 10. | యమపాశం |
| 11. | డొంకలో శవం | 12. | మొసలి కన్నీరు |

శాస్త్రీయమైన నేర పరిశోధన తెలుసుకొన గోరేవారందరూ ఈ పుస్తకాలు చదవండి. ఆకర్షణీయమైన ముఖచిత్రాలు.

ఒక్కొక్కదాని వెల 0—8—0. ఏజెంట్లకు 25% కమీషను

వివరాలకు :

జ్యోతి కార్యాలయం

మద్రాసు-17.